APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 06 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :70 పేజీలు : 04 వెల: 2-00/-



## ఇరాన్‌కు ట్రంప్
# మరో హెచ్చరిక

- హర్మూజ్ జలసంధి వెంటనే తెరవాలని డిమాండ్
- చర్చల నుంచి వెనక్కి తగ్గితే తీవ్ర పరిణామాల హెచ్చరిక
- అణ్వాయుధాలకు అవకాశం లేదని అమెరికా స్పష్టం
- ప్రకటనలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

వాషింగ్టన్, ఆగస్టు 5 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ, వాటిని బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. ఇరాన్ చర్చల ప్రక్రియ నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని వెల్లడించారు. సైనిక శిక్షణలో నైపుణ్యాల మార్పిడి, రక్షణ రంగంలో సాంకేతిక సహకారం, విద్యా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

## విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు రూ.9.50 లక్షల కోట్ల లక్ష్యం

- విశాఖ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులతో ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే కార్యాచరణ
- పోర్టులు, ఏఐ డేటా సెంటర్లు, క్లీన్ ఎనర్జీకి పెద్దపీట
- సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు



అమరావతి, ఆగస్టు 5 : విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతంలోని ప్రతి జిల్లాను పారిశ్రామిక, ఆర్థిక, పర్యాటక, మౌలిక సదుపాయాల పరంగా సమానంగా అభివృద్ధి చేసేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా మొత్తం రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో ప్రభుత్వ రంగం ద్వారా రూ.3.50 లక్షల కోట్ల పెట్టుబడులు, ప్రైవేట్ రంగం ద్వారా రూ.5.50 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించేలా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ప్రతి ప్రాజెక్టుకు గడువులు, అమలు విధానం, పెట్టుబడుల సమీకరణ వ్యూహాన్ని ముందుగానే ఖరారు చేయాలని సూచించారు.

## విశాఖలో
## పీవీ సింధు క్రీడా కేంద్రానికి భూమిపూజ



విశాఖపట్నం, ఆగస్టు 5 : విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పీవీ సింధు పాల్గొన్నారు. కార్యక్రమానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి క్రీడా కేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా క్రీడా రంగ అభివృద్ధిపై చర్చించిన నాయకులు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణా కేంద్రాలు ఏర్పాటైతే రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ఆధునిక సౌకర్యాలతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రీడా కేంద్రం ద్వారా బ్యాడ్మింటన్‌తో పాటు ఇతర క్రీడల్లో కూడా ప్రతిభ కలిగిన యువతకు నాణ్యమైన శిక్షణ, ఆధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ స్థాయి కోచింగ్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

## రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది: జగన్



దేవరపల్లి, ఆగస్టు 5 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయం నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పొగాకు రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని జగన్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర లభించేదని, కొంతమంది రైతులు రూ.365 వరకు కూడా పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ధర రూ.236కు పడిపోయిందని, అదే సమయంలో సాగు ఖర్చులు గణనీయంగా పెరగడంతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం రైతుల నుంచి కేవలం 21 శాతం పొగాకును మాత్రమే కొనుగోలు చేసిందని జగన్ ఆరోపించారు. మిగిలిన పంట కొనుగోలు విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. మార్కెట్‌లో రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకే వదిలేసిందని అన్నారు. రైతుల కష్టాన్ని పట్టించుకునే పరిస్థితి ప్రభుత్వంలో కనిపించడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక తీవ్ర మనసా-పానికి గురైన వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం విచారకరమని అన్నారు. రైతుల ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

## పొగాకు రైతుల అంశంపై బహిరంగ చర్చకు సవాల్



అమరావతి, ఆగస్టు 5 : పొగాకు రైతుల సంక్షేమంపై వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి సుమారు రూ.280 కోట్లు వెచ్చించామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అలాగే 2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు తగ్గిన సమయంలో రైతులకు ప్రతి కిలోకు రూ.20 చొప్పున ఆర్థిక సహాయం అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2019లో 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి జరిగినప్పటికీ కేవలం 11.8 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు చేశారని ఆరోపించారు. అనంతరం ఏడాది 128 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినప్పటికీ ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. పొగాకు ధరల విషయాన్ని ప్రస్తావిస్తూ 2019లో కిలో ధర రూ.142 ఉండగా, కూటమి ప్రభుత్వ హయాంలో 2024లో రూ.326, 2025లో రూ.300, 2026లో రూ.275గా నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు 241 మిలియన్ కిలోల ఉత్పత్తి చేశారని పేర్కొన్నారు. అధిక ఉత్పత్తి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం 100 మిలియన్ కిలోల పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ సాయం పంపిణీని గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, అంచనాకు మించి ఉత్పత్తి వచ్చినా అదే విధంగా కిలోకు రూ.10 చొప్పున సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అదనంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50 వేల వడ్డీలేని రుణం అందిస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులను ఎవరు ఆదుకున్నారో, ఎవరు నిర్లక్ష్యం చేశారో ప్రజల ముందే తేల్చుకుందామని, బహిరంగ చర్చకు సిద్ధమేనా అని జగన్‌ను ప్రశ్నించారు.

# చేతనైతే ఆధారాలతో మాట్లాడండి...లేదంటే సైలెంట్ గా కూర్చోండి

- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణల మీద ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం
- నారాయణపురం గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా గమనించాలన్న ఎమ్మెల్యే
- రాయలసీమ ప్రాజెక్టులను ఏరోజైనా పట్టించుకున్నారా అని నిలదీసిన దగ్గుపాటి

అనంతపురం, ఆగస్టు 5 అనంత సూర్య : మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వైసీపీ వద్ద ఆధారాలు ఉంటే మాట్లాడాలని.. లేదంటే సైలెంట్ గా కూర్చోవాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వర్ నగర్ లో ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నారాయణపురం పంచాయతీలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలకు బ్రిడ్జి, రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. గత




ప్రభుత్వంలో ఏం చేశారు..కూటమి ప్రభుత్వంలో ఏం జరుగుతోందన్నది ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని.. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఇది కక్షలు, కార్పణ్యాలు తీర్చుకుని గొడ్డలి పార్టీ కాదని.. ప్రజా క్షేమం కోరే కూటమి పాలన అని దగ్గుపాటి అన్నారు. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థను నాశనం చేస్తే.. అలాంటి శాఖను మంత్రి నారా లోకేష్ ఛాలంజింగ్ గా తీసుకున్నారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు మించిన స్థాయిలో బడులను మార్చారన్నారు. 16347ఉపాధ్యాయ పోస్టులను ఎలాంటి వివాదం లేకుండా భర్తీ చేస్తే.. దీనిపై వైసీపీ నాయకులు పూటకో రాద్ధాంతం చేస్తున్నారన్నారు. రాయలసీమ గురించి ఇక్కడి ప్రాజెక్టుల గురించి కానీ వైసీపీ నాయకులు ఏరో-జైనా పట్టించుకున్నారా అని నిలదీశారు. ఈ రోజు హార్టికల్చర్ హబ్ కు 40వేల కోట్లు కేటాయించారని.. పీపీపీ మోడల్లో మరో 60వేల కోట్లు తీసుకొస్తున్నారన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు రాయలసీమకు తీసుకొచ్చారని.. ప్రతిష్టాత్మక సంస్థలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పుతున్నాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా పోలవరం, అమరావతి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు కేవలం ప్రభుత్వంపై బురదచల్లాలనే రోజుకో వివాదం సృష్టిస్తున్నారని.. వారు ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ క్లస్టర్ ఇంచార్జ్ డిష్ నాగరాజు, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షదుల్లా, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, క్లస్టర్ ఇంచార్జ్ లు దళావాయి వెంకటనారాయణ, వన్నూరప్ప, టిడిపి నాయకులు మారుతి కుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు, రఘునాథ్, రమేష్, డాక్టర్ హరి ప్రసాద్, సింగవరం వ్యక్తం, నెట్టెం బాలకృష్ణ, అశ్విని, మాధవి, వరాలమ్మ, వెంకటలక్ష్మి, అక్షిత, శోభ, అయేషా నేహా, యశోద టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు, కేసులకు కేరాఫ్ అడ్రస్ గా ఆంధ్రప్రదేశ్

## డిఎస్సి అక్రమాల నుండి డైవర్ట్ చేయడానికే ముస్తఫా అరెస్ట్

## - వైసీపీ మైనార్టీ నేతల విమర్శలు

అనంతపురం, ఆగస్టు 5 అనంత సూర్య : అక్రమ అరెస్ట్ లు, అక్రమ కేసులకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్ గా మారిందని వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు మొఘల్ సైఫుల్లా బేగ్ విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు మొఘల్ సైఫుల్లా బేగ్, మాజీ మేయర్ మహమ్మద్ వసీం తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొఘల్ సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను సరైన ఆధారాలు లేకుండానే అరెస్ట్ లు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, మైనార్టీ నేత ముస్తఫా కు భాగస్వాముల మధ్య వ్యాపార లావాదేవీలలో విబేధాలకు ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గుజరాత్ కు వెళ్లి మరీ అరెస్ట్ చేయడం దుర్మార్గకరమన్నారు. రాష్ట్రంలో పోలీసులు టీడీపీ నేతలు చెప్పినట్లు నడుస్తున్నారని, రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం ఉందా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలకు వస్తున్న స్పందన చూసి



కూటమి నేతలు వైసీపీ నేతలను భయపెట్టేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు ఎవరూ బయపడరని, న్యాయబద్ధంగానే వాటిపై పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. మాజీ మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి 25 నెలల పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయించి అక్రమ అరెస్ట్ లు చేస్తున్నారని విమర్శించారు. పోలీసులు సైతం ప్రజలను రక్షించాల్సింది పోయి టీడీపీ నేతలు చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఆరోపించారు. ఎలాంటి నేర చరిత లేని మైనార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వ్యాపారాన్ని రాజకీయానికి లింక్ పెట్టి అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు. ముస్తఫా కుటుంబానికి రాష్ట్రంలోని మైనార్టీ లు అండగా ఉంటారని పేర్కొన్నారు. డిఎస్సి అక్రమాలకు బాధ్యత వహించి మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలన్న డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దాని నుండి డైవర్ట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే ముస్తఫా ను అరెస్ట్ చేశారని ఆయన విమర్శించారు. మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి వేముల నదీమ్ మాట్లాడుతూ.. మచ్చలేని నాయకులు ముస్తఫాను కక్ష సాధింపులతో ముందుకు భాగంగా అరెస్ట్ చేశారన్నారు. తొలి నుండి మైనార్టీలంతా వైసీపీ వెంట నడుస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేక మైనార్టీలను కూటమి నేతలు వేధిస్తున్నారన్నారు. మహిళా విభాగం నాయకురాలు ఖమర్ తాజ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అక్రమ అరెస్ట్ తో మైనార్టీల గొంతు నొక్కలేరని చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మైనార్టీలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇషాక్, మహబూబ్ బాషా, ఏ1 రఫీ, ఖాదర్, అబ్బాస్, కిషోర్, ఖమర్ తాజ్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో సూర్యఘర్ యోజనకు విశేష స్పందన

## 9.04 లక్షల దరఖాస్తులు 2.66 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు

న్యూఢిల్లీ,ఆగస్టు 5(అనంత సూర్య): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకానికి ఆంధ్రప్రదేశ్‌లో విశేష స్పందన లభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర కొత్త, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.కేంద్ర మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, 2026 జూలై 31 నాటికి రాష్ట్రంలో 9,04,508 గృహాలు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోగా, 2,66,417 ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు పూర్తయింది. దీంతో 2,70,932 కుటుంబాలు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందుతున్నాయి. ఈ పథకం అమలుకు రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.1,512.61 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా ఈ పథకానికి 76.81 లక్షల దరఖాస్తులు అందగా, 41.19 లక్షల సోలార్ ఇన్‌స్టాలేషన్లు పూర్తయ్యాయని, 49.62 లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందుకోసం కేంద్రం రూ.27,855.99 కోట్ల సబ్సిడీ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ



ప్రసాదరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని విస్తరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా సాధారణ కుటుంబాలకు విద్యుత్ ఖర్చు తగ్గడంతో పాటు స్వయం సమృద్ధి సాధించే అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు.పథకం అమలులో ఎదు-రవుతున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారని ఎంపీ తెలిపారు. దరఖాస్తుదారులకు 15 రోజుల్లో సబ్సిడీ చెల్లింపు, 5.75 శాతం వడ్డీతో తక్కువ వడ్డీ రుణాలు, నెట్ మీటరింగ్ ప్రక్రియ సరళీకరణ, ఎంపానెల్ విక్రేతల సంఖ్య పెంపు, విస్తృత ప్రచార కార్యక్రమాలు, 15555 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలును కేంద్ర కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, ఆర్ఈసీ లిమిటెడ్, రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల సమన్వయంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కేంద్ర మంత్రి సమాధానంలో పేర్కొన్నారని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు

# బీసీ హాస్టల్లో సీట్లు పెంచాలి

అనంతపురం ఆగస్టు 5 అనంత సూర్య : కరువు జిల్లా అయినా అనంతపురం జిల్లాలో బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎక్కువ మంది ఉన్నారని, ఈ కరువు జిల్లాలో 60 శాతం మంది బీసీ జనాభా కలిగి ఉన్నారని, ఈ జిల్లాలో బీసీ హాస్టల్ లలో విద్యార్థులకు రద్దీకి కనుగుణంగా బిసి హాస్టల్ సీటు పెంచాలని ఆంధ్ర ప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ నేతలు వెనుక బడిన తరగతుల శాఖ జిల్లా అధికారి కుష్బూ కొఠారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ లు ఆర్థిక పరిస్థితులు కూడా అంతంత మాత్రమేనని, ఈ బీసీ వర్గాల ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలలో అధిక ఫీజులు ఉండటం వల్ల వారి పిల్లలను బాగా చదివించుకోలేకున్నారు. పిల్లలు విద్యావంతులు కావాలని ఉద్దేశంతో పిల్లలను నగరంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, హాస్టల్లో సీట్లు లేక చాలా ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల రద్దీకి అనుగుణంగా జిల్లాలో ఉన్న ప్రతి బీసీ హాస్టల్లో 30, 40 సీట్లు పెంచాలని విజ్ఞప్తి చేస్తూ పేద విద్యార్థుల సహాయం అందించాలని కోరారు. విద్యార్థి నేతలతో డిడి మాట్లాడుతూ.. తమ డిమాండ్లను ఉన్నత అధికారుకుల ఇసుక తీసుకెళ్లి బీసీ సంక్షేమ హాస్టల్లో సీట్లు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, రాజేష్, మురళి రెడ్డి, హర్ష, చిన్నకేశవులు, జస్వంత్, తదితర విద్యార్థి నేతలు పాల్గొన్నారు.



# మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం

అనంతపురం, ఆగస్టు 5 అనంత సూర్య : మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయంగా శ్రమిస్తామని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు






జశ్వంత్ వ్యాస్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కోర్టు రోడ్డులో గల శివకృప కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గంలోకి పలువురికి అవకాశం కల్పించినట్లు జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి నారాయణమర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. రాయితీలు, సంక్షేమ పథకాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా చూ-స్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, న్యాయవిభాగం జిల్లా అధ్యక్షులుగా బెస్త ఓబులరాజు, జిల్లా సలహాదారునిగా తుపాకుల శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా బెస్త రాములను ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోటా రాజేశ్వరి, రాష్ట్ర మహిళా సభ్యురాలు వనజ వాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడుగు నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పిల్లి మద్దిలేటి, జిల్లా గౌరవ సలహాదారులు వరదాయపల్లి మాజీ సర్పంచ్ బెస్త రమణ, బెస్త గంగప్ప, జిల్లా ఇన్‌ఛార్జ్ శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త విజయ సత్యం, బెస్త వెంకటేష్, జిల్లాల కోశాధికారి బెస్త రామాంజనేయులు, నగర అధ్యక్షులు బెస్త అశోక్, సభ్యులు బెస్త శంకర్ ప్రసాద్, బెస్త నారాయణస్వామి, బెస్త మల్లికార్జున, బెస్త శ్రీరాం, బెస్త అంజి, బెస్త ఓబులేసు, బెస్త ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు..

# బాల్యవివాహాలు, పోక్సో చట్టం, శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

చిత్తూరు,ఆగస్టు 5(అనంత సూర్య): బాల్యవివాహాల నివారణ, పోక్సో చట్టం, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై చిత్తూరు జిల్లా పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు మహిళా డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో శక్తి బృందాలు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండక ముందే బాలికలకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని, చిన్న వయసులో వివాహం వల్ల విద్యకు అంతరాయం కలగడంతో పాటు ఆరోగ్య, భవిష్యత్ పరమైన సమస్యలు ఎదు-రవుతాయని వివరించారు. బాలికలు విద్యను కొనసాగించి జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు.పోక్సో చట్టం కింద బాలలపై లైంగిక వేధింపులు, దాడులకు కఠినమైన శిక్షలు ఉంటాయని, అలాంటి సంఘటనలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని చెప్పారు.అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ నంబర్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించిన పోలీసులు, యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరి తక్షణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులతో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి వినియోగ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ ప్రేమకుమారి, హెడ్‌మాస్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకటేశ్వరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అనంత సూర్య
తెలుగువార్త

గురువారం 06 ఆగస్టు 2026

## శాంతిభద్రతలు, మహిళల రక్షణే ధ్యేయం బీకేఎస్ ఎస్ఐ ఆంజనేయులు

వడియంపేట, ఆగస్టు 05 :(అనంత సూర్య) : కొత్తపల్లి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు మహిళల భద్రత, సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బుక్కరాయసముద్రం ఎస్ఐ పి.వై. ఆంజనేయులు సూచించారు. బుధవారం స్థానిక సిబ్బంది, గ్రామ మహిళా పోలీసులతో కలసి ఆయన వడియంపేట, కొత్తపల్లి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడతూ... అత్యవసర సమయంలో మహిళల రక్షణ కోసం 'శక్తి యాప్'



ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యాప్ వినియోగంపై గ్రామస్తులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, ఎవరైనా మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చేతన సన్మార్గం వైపు అడుగులు... సగర్వ జీవనానికి పునాదులు

### ట్రాన్స్జెండర్ల స్థిర నివాసాల కల్పన కోసం ఇళ్ల స్థలాల పరిశీలన

అనంత క్రైమ్, ఆగస్టు 05:( అనంత సూర్య): ఉప్పరపల్లి శివార్లలో... జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో "క్షేత్ర స్థాయి పర్యటన" స్థానిక రెవెన్యూ, తదితర ప్రభుత్వ విభాగాలతో పాటు పరిశీలనకు వెళ్లిన ఆర్డీటీ ప్రతినిధులు " ట్రాన్స్జెండర్ల సగర్వ జీవనానికి పునాదులు వేస్తున్న అనంతపురం జిల్లా పోలీస్ శాఖ అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ వినూత్నంగా చేపట్టిన "చేతన... సన్మార్గం వైపు అడుగులు. సగర్వ జీవనానికి పునాదులు" కార్యక్రమంలో భాగంగా ఈరోజు అత్యంత కీలకమైన అడుగు పడింది. సమాజంలో ఆదరణకు దూరమైన ట్రాన్స్జెండర్లు మరియు షికారీ సామాజిక వర్గాల వారికి శాశ్వత స్థిర నివాసం ఏర్పాటు చేసేందుకు ఉప్పరపల్లి శివార్లలో లిజిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా క్షేత్రసా-



ాయిలో హౌసింగ్ కోసం స్థల పరిశీలన జరిపారు.

క్షేత్రస్థాయి స్థల పరిశీలన : స్థల లభ్యత ఒ అనుకూలతల పరిశీలనలి : ఉప్పరపల్లి శివార్లలోని ప్రభుత్వ భూములను పరిశీలించిన ఎస్పీ, నివాస గృహాల నిర్మాణానికి అనువైన వాతావరణం, రవాణా సౌకర్యాలు మరియు భూమి సరిహద్దులపై రెవెన్యూ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వేగవంతంగా భూకేటాయింపు చర్యలులి : స్థల పరిశీలన అనంతరం, వీలైనంత త్వరగా సర్వే ప్రక్రియ పూర్తి చేసి, అర్హులైన ట్రాన్స్జెండర్లు మరియు షికారీ కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేసేలా చర్యలు వేగవంతం చేయాలని రెవెన్యూ విభాగాన్ని కోరారు.

జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ వెల్లడి : "సమాజంలో వెనుకబడిన ట్రాన్స్జెండర్లు, షికారీలు ఆత్మగౌరవంతో, సగర్వంగా జీవించాలనే లక్ష్యంతోనే 'చేతన' కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ రోజు జరిపిన స్థల పరిశీలన వారి జీవితాల్లో స్థిరత్వానికి మొదటి మెట్టు. వారికి శాశ్వత నివాసం కల్పించి, సన్మార్గంలో సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే మా ముఖ్య ఉద్దేశం." ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఆర్డీటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### జిల్లా కలెక్టర్‌ను కలిసిన సభ్యులు

అనంత కలెక్టరేట్ ఆగస్టు 05 (అనంత సూర్య): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురము జిల్లా శాఖ పాలకసమితి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, నూతన కార్యవర్గ ఎన్నికలు మరియు వార్షిక సర్వసభ్య సమావేశం ఈ ఏడాది ఏప్రిల్ 29న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల అధికారి జి. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. నూతన కార్యవర్గంలో సభ్యులుగా ఎన్నిక కావడానికి నాలుగు ప్యానెల్‌ల నుంచి మొత్తం 44 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సేవా సంస్థ అయిన రెడ్ క్రాస్‌లో సేవాభావానికే ప్రాధాన్యం ఉండాలని, ఎన్నికలు వివాదాలకు దారితీయకుండా ఏకాభిప్రాయంతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్ క్రాస్ శాఖతో పాటు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఓ. ఆనంద్, సూచించారు. ఈ మేరకు అన్ని ప్యానెల్‌ల ప్రతినిధులతో రెండు దఫాలుగా సమావేశాలు నిర్వహించి, పరస్పర అవగాహనతో 11 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అనంతరం సభ్యులలో ముగ్గురిని



చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్‌లుగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఐ.ఏ.ఎస్. అధికారికంగా ధృవీకరించారు. నూతన కార్యవర్గంలో డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్ చైర్మన్‌గా, ప్రొఫెసర్ డా. గీతా బాల వైస్ చైర్మన్‌గా, సుంకర రమేష్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డా. కె. లక్ష్మీనారాయణ, ఎం.జి. ఎరన్న, డా. ఓ. మనోరంజన్ రెడ్డి, ఆలంబన జనార్ధన్, భిసతి భరత్, దాసరి భరత్ కుమార్, వి.కె. శ్రీవాణి మరియు విష్ణుప్రియ ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఓ. ఆనంద్, వారి ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ, వైద్య, విద్య, వ్యాపార, సామాజిక సేవ తదితర విభిన్న రంగాలకు చెందిన అనుభవజ్ఞులు ఒకే వేదికపై కలసి సమర్థవంతమైన కార్యవర్గంగా ఏర్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. సభ్యులందరూ సమిష్టి భావంతో పనిచేస్తూ రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు.

ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న "చేయూత" ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని రాబోయే రోజుల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురము జిల్లా శాఖ కార్యాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లా పరిపాలన అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, రక్తదానం, ప్రథమ చికిత్స శిక్షణ, విపత్తు నిర్వహణ, ఆరోగ్య సేవలు, యువజన సేవా కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాలు మరియు ఇతర మానవతా సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## అంగ రంగా వైభవంగా జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రోగ్రాం

### ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

లేపాక్షి, ఆగస్టు 05:( అనంత సూర్య ): పది, పన్నెండో తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం 'నవోదయ ఫౌండేషన్ డే' వేడుకలు అత్యంత వేడుకగా, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 11:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలకు విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రిన్సిపాల్ నాగరాజు స్వాగతోపన్యాసం చేస్తూ, నవోదయ విద్యాలయాల ఆవిర్భావం మరియు ఫౌండేషన్ డే ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయ (జీవీఎం) విద్యార్థులు గూజా, ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాధించిన ప్రతిభను జిల్లా కలెక్టర్ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్ క్లాస్ పాస్ శాతం 80% కాగా, జీవీఎం లేపాక్షి




100% ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జూడో క్రీడలో 24 మంది విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపిక కావడంపై ప్రత్యేక ప్రశంసలు తెలిపారు. విద్య అంటే కేవలం పుస్తకాల సమాచారాన్ని బట్టీ పట్టడం కాదు, ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆవిష్కరణలు చేయడమే అసలైన విద్య అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువులతో పాటు సమాజంలో సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత సమాజానికి తమ వంతు సేవ చేయడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పట్టు గూడు నుంచి సీతాకోకచిలుక సహజంగా బయటకు వచ్చినట్లే, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను కష్టపడి జయించాలని, గెలుపుకు కుదరదారు లేవని స్పష్టం చేశారు. అనంతరం విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదవ మరియు పన్నెండవ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు మరియు సత్కారం అందించారు. 10వ తరగతి ప్రతిభావంతులు:

కె. లాస్య రెడ్డి – 98% (జిల్లా/పాఠశాల మొదటి ర్యాంకు)
కె. కిరణ్ తేజ – 94.6% (రెండవ ర్యాంకు)
ఎస్. అభిరామ్ – 94.4% (మూడవ ర్యాంకు)
వై. స్నేహలత – 94.4% (మూడవ ర్యాంకు)

12వ తరగతి ప్రతిభావంతులు:
ఎస్. చిత్రలేఖ – 87.4% (మొదటి ర్యాంకు)
పి. హేమలత – 86.2% (రెండవ ర్యాంకు)
ఎన్. కార్తీక్ సాయి – 85.6% (మూడవ ర్యాంకు)ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు.

ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ,పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక అవగాహన కార్యక్రమం

విజయనగరం ఆగస్టు 05 (అనంత సూర్య) : రాజాం పట్టణ పరిధిలోని ది సన్ స్కూల్ విద్యార్థులకు బుధవారం అగ్నిమాపక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజాం పట్టణ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ అశోక్ కుమార్ విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థిత-ుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు



ఎలా స్పందించాలి, మంటలను ప్రాథమిక స్థాయిలో ఎలా అదుపు చేయాలి, అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి వంటి అంశాలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. విద్యార్థులతోనే ప్రాక్టికల్‌గా చేయించి, అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా వ్యవహరించే విధానాన్ని చూపించడం విశేషం. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రాజాం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల్లో భద్రతా అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## అంగరంగ వైభవంగాచౌడేశ్వరి దేవి బోనాలు నిర్వహిస్తాం..

### తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసిహరి

పెనుకొండ, ఆగస్టు 05 ( అనంత సూర్య): జగన్మాత సృష్టికర్త ప్రపంచ మానవాళికి కొంగుబంగారమై విరాజుల్లు శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా తెలంగాణ తరహాలో బోనాలను నిర్వహిస్తున్నట్లు తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరి తెలిపారు. ఆషాడ అమావాస్య పర్వదినాన చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా సుమారు 1500 బోనాలతో మహిళలు ముఖ్యంగా యువతులు చిన్నారులు అమ్మవారిని



దర్శించుకుంటారన్నారు. బోనాల మహోత్సవానికి కావలసిన కుండలను ( బోనాలను) చౌడేశ్వరి దేవాలయం, పెద్దమ్మ దేవి ప్రాంగణందుర్గా నగర్ నందు, వినాయక దేవస్థానంగీతా నగర్, ఆంజనేయ స్వామి కట్టసప్తగిరి కాలనీ ప్రాంతాలలో ఈనెల 8 నుండి విరివిగా దొరుకుతాయని తెలిపారు. కుల మతాలకతీతంగా నాడు జరిగే కార్యక్రమంలో అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని, చౌడేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, జ్యోతి సంఘం సభ్యులు సహకారంతో విజయవంతం చేయాలన్నారు.

## క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది....

### - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంత కలెక్టరేట్ ఆగస్టు 05 (అనంత సూర్య): క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అనంతపురం శా-సనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. అశోక్ నగర్ లోని ఈ సి ఐ చర్చి పాస్టర్ డేవిడ్ కు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన మ్యారేజ్ లైసెన్స్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారికంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రైస్తవుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాస్టర్ల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడం, సబ్సిడీ రుణాలు, జెరూసలేం యా-త్రకు ఆర్థిక సహాయం, చర్చి నిర్మాణాలకు ఆర్థిక సాయం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈటె స్వామిదాసు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు.

## రైతు ఫోటోతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ




ఓడిచెరువు, ఆగస్టు 5: రైతుల భూ హక్కులకు మరింత భరోసా కల్పించేందుకు ప్రభుత్వం రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఓడిచెరువు మండలంలోని డబురువారిపల్లి, తిప్పేపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె 2,237 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. "మన భూమి -- మన హక్కు" అనే లక్ష్యంతో రైతుల హక్కులను పరిరక్షించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405